క్లుప్తంగా

సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: గీతాంజలి మ్యూజికల్, ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సినీ నటుడు చిరంజీవి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం పొందిన సందర్భంలో గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వేటూరి పాటల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ స్వయం కృషితో అందరివాడనిపించుకున్న నటుడు చిరంజీవి అని అభివర్ణించారు. చిరంజీవి ఐ బ్యాంక్ ద్వారా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు ఆధ్వర్యంలో రామభద్రకుమార్, రవికుమార్, రూపశ్రీ, మోహన, భావన చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు. వివిధ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, పరుచూరి విజయలక్ష్మి, చిట్టిబాబు, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

డిసెంబరు 28, 29 తేదీల్లో 'యువగళ సమ్మేళనం'

విజయవాడ కల్చరల్: కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 28, 29 తేదీల్లో విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలో యువతకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 40-45 లోపు వారికి యువగళ సమ్మేళనం, కవితా వైభవ సభ జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కవిత, గేయం, లలిత గేయం, గజల్, పద్యంలో స్వీయ కవితాగానం చేయవచ్చని రుసుం చెల్లించవలసిన అవసరం లేదని రాత ప్రతిని నవంబరు 30వ తేదీ లోపు 94401 67697, 94417 82642 నంబర్లకు పంపాలని కోరారు. కవి సమ్మేళనంలో పాల్గొనేవారు చదువుకొనే పాఠశాల నుంచి ధ్రువపత్రం తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు.

కుట్టుమిషన్, కిట్లు అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీసత్యసాయి సేవా సంస్థల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం పాయకాపురం శాంతినగర్లోని శ్రీశారద విద్యాలయంలో శ్రీసత్యసాయి సేవాసంస్థ ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారికి కుట్టుమిషన్, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర, రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ ఇన్చార్జి కె.నాగప్రసాద్, శారద విద్యాలయం కన్వీనర్ పి.అప్పలరాజు పాల్గొన్నారు.

200 మంది భక్తులకు అన్నప్రసాదం

విజయవాడ కల్చరల్: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం రెండువందల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ సీహెచ్ లలితాదేవి, వెన్నవల్లి వెంకట వీర నాగశ్రీనివాస్, కావ్య, వెంకట శివకృష్ణ శ్రీకాంత్, శ్రీదేవి, శశిదేవి పాల్గొన్నారు. దేవాలయ అర్చకుడు మురళీకృష్ణ స్వామి కార్తిక మాస వైభవం అంశంగా ప్రసంగించారు. శివనామ స్మరణ భక్తిముక్తిదాయకమని తెలిపారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలోనూ, శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీఎఫ్సీ 7 స్టార్ దరఖాస్తుపై అభ్యంతరాల స్వీకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో చెత్తను సమయానికి సేకరించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నందున విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జీఎఫ్సీ 5 స్టార్ సర్టిఫికేషన్ సాధించింది. ఈ నేపథ్యంలో 2024లో జీఎఫ్సీ 7 స్టార్ సర్టిఫికేషన్ కోసం దరఖాస్తు చేస్తున్నందున ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన జారీ చేసిన రోజు నుంచి 10 రోజుల లోపు తెలియజేయాలని ఈ మేరకు నగరపాలక సంస్థ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అభ్యంతరాలను 81819 60909 నంబర్కు తెలియజేయాలని కోరింది.

వాటర్ పైప్లైన్ పనులు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామలింగేశ్వరపేటలో గురువారం రూ. 8.82 లక్షల వ్యయ అంచనాతో వాటర్ పైపులైన్ పనులను కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో పాత కాలంనాటి పైపులైన్లు కావటంతో తుప్పుపట్టి పాడయ్యాయన్నారు. తాను కౌన్సిల్లో ఆరు నెలల క్రితం ప్రతిపాదనలు పెట్టగా ఆమోదించారన్నారు. ఇప్పుడు రామలింగేశ్వరపేట రైండో లైను, రామదాసు నారాయణ వీధిలో కొంత బాగం పైపులైన్ పనులు రూ. 8.82 లక్షలతో చేపట్టినట్లు తెలిపారు. రూ. 8లక్షల వ్యయంతో చింతచెట్టు రోడ్డు, రూ. 18.42లక్షలతో రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్డు, రూ. 13లక్షలతో శాంతినగర్ ఆమ్మోస్ చర్చి నుంచి శంకర్ కాంపౌండ్ వరకు వాటర్ పైపులైన్ పనులు చేపట్టనున్నామని తెలిపారు.



అజిత్సింగ్నగర్ పీఎస్ వద్ద వెలగని వీధి దీపాలు



వాటర్ ట్యాంక్ రోడ్డులో కాంతులేవీ

అంధకారంలో..

- వరద బీభత్సం తర్వాత న్యూ ఆర్ఆర్ పేటలో వెలగని వీధి దీపాలు
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- పేట్రేగిపోతున్న ఆకతాయిలు.. గంజాయి బ్యాచ్లు

అజిత్సింగ్నగర్(విజయవాడసెంట్రల్): న్యూరాజరాజేశ్వరిపేట అంధకారంతో విలవిలలాడుతోంది. ఈ ప్రాంతం 57వ డివిజన్లో ఉంటుంది. ఇక్కడ ఏ వీధికి వెళ్లినా.. ఏ రోడ్డు చూసినా.. వెలగని దీపాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాదచారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు.

ప్రధాన రోడ్లపై కానరాని కాంతులు

బుడమేరు వరద ముంపు తర్వాత నుంచి ఈ ప్రాంతంలో న్యూఆర్ఆర్పేట, అరుణోదయ నగర్, జామతోట, అమరావతికాలనీ, సుందరమ్మదిబ్బ పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు సరిగా వెలగడం లేదు. అజిత్సింగ్నగర్ పోలీస్స్టేషన్కు వెళ్లే ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతాలన్నీ చీకటిమయంగా మారుతున్నాయి.

ఆకతాయిల ఆగడాలు

అంధకారాన్ని అదునుగా చేసుకొని ఇక్కడి ఆకతాయిలు పేట్రేగిపోతున్నారు. గుంపులుగా.. గ్రూపులుగా రోడ్లపై చేరి రాకపోకలు సాగించే యువతులు, విద్యార్థినులు, మహిళలపై అసభ్య పదజాలాలతో రెచ్చిపోతూ.. వారి వెకిలి చేష్టలతో వేధింపులకు గురిచేస్తున్నారు.

ప్రధానంగా వాటర్ట్యాంక్ రోడ్డులో, కేఆర్అండ్షేర్ స్కూల్ రోడ్డు, దేవినేని వెంకటరమణ హైస్కూల్, అమరావతికాలనీకి వెళ్లే రహదారి, కేజీఎఫ్ అపార్ట్మెంట్ ప్రాంతాల్లో ఆకతాయిల సమస్య అధికంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ అధికారులు వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని, పోలీసులు ప్రత్యేక బీట్లు ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.



అపార్ట్మెంట్లకు వెళ్లే దారిలో చీకటి

ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి



అరుణోదయనగర్, జామతోట ప్రాంతాల నుంచి అయోధ్యనగర్ వైపునకు వెళ్లే మార్గంలో వీధిలైట్లు సరిగా వెలగడం లేదు. దీంతో రాత్రుల సమయంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. వరదల తర్వాత ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అధికారులు దృష్టి సారించి వీధి లైట్లకు మరమ్మతులు చేయించాలి. – టి.బాల, అరుణోదయనగర్

రోడ్డుపైకి రావాలంటే భయంగా ఉంది



అమరావతి కాలనీలో వీధిలైట్లు సరిగా వెలగడం లేదు. గుడి మెయిన్రోడ్డు, మూడో లైన్లలో అసలు లైట్లు పనిచేయడం లేదు. రోడ్డు వెంబడి చెట్లు గుబురుగా ఉండడంతో ఆకతాయిలు, మందుబాబులు కూర్చొని రోడ్లపై మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. చీకటిపడితే భయంగా ఉంటోంది.

–డీవీ సుబ్రహ్మణ్యం, అమరావతికాలనీ ప్రెసిడెంట్

11, 12 తేదీల్లో విద్యార్థులకు 'సర్వోత్తమ'లో పోటీలు

పటమట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు నవంబర్ 11,12 తేదీల్లో వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, జ్ఞాపక శక్తి, పద్య పఠనం, బుక్ హంట్లపై పోటీలు జరుగుతాయని వివరించారు. సబ్జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని సబ్ జూనియర్లకు (1 నుంచి 4 తరగతులు) 11వ తేదీ ఉదయం 10 గంటలలకు తాము ఇచ్చిన కథకు బొమ్మ వేయడం, 12వ తేదీ ఉదయం 10 గంటలకు మేము ఇచ్చిన అంశంపై కథ చెప్పడంలో పోటీలు ఉంటాయని తెలిపారు.

జూనియర్లకు (5 నుంచి 7 తరగతులు) 11వ తేదీ ఉదయం 10 గంటలకు తాము ఇచ్చిన పుస్తకానికి సమీక్ష, 12వ తేదీ ఉదయం 10 గంటలకు 5వ తరగతి వారికి జ్ఞాపకశక్తిపై, 6వ తరగతి వారికి దాశరథి పద్యం, భావం చెప్పడం, 7 వ తరగతి వారికి బుక్ హంట్ పైనా పోటీలుంటాయని వివరించారు.

సీనియర్లకు (8 నుంచి 10 తరగతులు) 11వ తేదీ 10 గంటలకు తాము ఇచ్చిన పుస్తకానికి సమీక్ష రాయడం, 12వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు తాము ఇచ్చిన అంశంపై కథ రాయడంపై పోటీలుంటాయని, ప్రతి పోటీకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రైవేట్, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలు సర్వోత్తమ గ్రంథాలయంలోగానీ, 79953 13148 నంబర్లోగానీ తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు.

నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం

వీఎంసీ సమీక్ష సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం నగరాభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, వివిధ శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో చేపట్టిన పనులు, డ్రెయినేజీ విధానం, తాగునీటి సరఫరా, స్టేడియం అభివృద్ధికి అవసరమైన అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ భవిష్యత్లో నగరం వరద ముంపునకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో కొండ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి నీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుని 24 గంటలూ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్, ఆర్.శ్రీనాథ్రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జ్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జీ సృజన, డిప్యూటీ డైరెక్టర్ (హార్టీకల్చర్) రామ్మోహన్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని, కమిషనర్ ధ్యానచంద్ర

మల్లేశ్వరుడికి చందనాలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చన, అలంకరణలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు అనంతరం బిల్వాలతో అర్చన చేశారు. స్వామి వారికి కాగడా మల్లెలు, గన్నేరు పూలు, చందనంతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లకు దీపార్చన సేవ జరిగింది. భక్తులు, ఉభయదాతలు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది ఊంజల సేవలో పాల్గొని తరించారు.



అసాంఘిక శక్తులపై దృష్టి సారించండి

పాయకాపురం(విజయవాడరూరల్): అసాంఘిక శక్తులపై దృష్టి సారించాలని సీపీ రాజశేఖర్బాబు చెప్పారు. నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్బాబు గురువారం నున్న పోలీసుస్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. పీఎస్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని, చెడు నడత కల్గిన వ్యక్తుల విషయంలో పలు సూచనలు చేశారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం, ఇతరులను వేధించడం, పరువు ప్రతిష్టలకు భంగం కలిగించడం చేయకూడదని ఆ విధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో సీపీ మాట్లాడారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో నున్న ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నున్న పీఎస్ను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్బాబు

11 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో 'కార్తిక' ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 11వ తేదీ సోమవారం నుంచి 17వ తేదీ శనివారం వరకు నగరంలోని కామకోటినగర్ శంకర మఠం, జగ్గయ్యపేటలో మనగుడి కార్యక్రమంలో భాగంగా కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ కోస్తా జిల్లాల సూపరింటెండెంట్ మేడవరం క్రాంతికుమార్ తెలిపారు. పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 11వ నుంచి 17వ తేదీ వరకు కామకోటి నగర్ శంకర మఠంలో ఐదురోజుల పాటు కార్తిక మాస వైభవం అంశంగా ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని తెలిపారు. ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ 13వ తేదీ రాజీవ్నగర్లోని రామాలయంలో, జగ్గయ్యపేట బండిపాలెంలో తులసి మొక్కల పంపిణీ, 15వ తేదీ గుణదల పడవల రేవులోని శివాలయంలో మంగళ 'ద్వాదశి వ్రతం' సామూహికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో హిందూ ధర్మపచార పరిషత్ బాధ్యులు బొగ్గవరపు బాల కోటేశ్వరరావు, నందూరి వెంకట తాండవ కృష్ణ, సంకుల సత్యతులసి పాల్గొన్నారు. వివరాల బ్రోచర్ను అతిథులు ఆవిష్కరించారు.



బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న క్రాంతికుమార్, సీవీకే ప్రసాద్ తదితరులు

అంతర పాఠశాలల జాతీయ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

విజయవాడస్పోర్ట్స్: మౌంట్ ఫోర్ట్ హైదరాబాద్ రీజియన్ అంతర పాఠశాలల జాతీయ పోటీలను నగరంలోని ఎస్ఎస్ఎం స్కూల్లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి తెలిపారు. మౌంట్ జెనిత్-2024 పేరుతో 35వ జాతీయ క్రీడలను రీజియన్ పరిధిలోని మౌంట్ఫోర్ట్ స్కూల్స్లో చదివే 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్నామని స్కూల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం వెల్లడించారు. అథ్లెటిక్స్, బాస్కెట్బాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో జరిగే పోటీలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లోని 30 పాఠశాలల నుంచి 1,500 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులకు పాఠశాలలోనే వసతి కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ మాంటి, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రియాంక పాల్గొన్నారు. అనంతరం ట్రోఫీలను ఆవిష్కరించారు.



ట్రోఫీలను ఆవిష్కరించిన దృశ్యం

మౌలిక వసతుల ఏర్పాటుపై అశ్రద్ధ చూపొద్దు

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం మాచవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కొండపై నుంచి వచ్చే వ్యర్థాలు కింద పేరుకుపోవడం గమనించి, వెంటనే డిసిల్టింగ్ పనులను మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని రోడ్డుపై అండర్గ్రౌండ్ డ్రైనేజీ మూత సరిగ్గా లేకపోవడం గమనించి సత్వరమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నగర పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగరానికి చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో ధర్మపథం వేదికపై కె.నళిని శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. కూచిపూడి నృత్యాన్ని భక్తులు ఆసక్తితో వీక్షించారు.

ఉన్నా లేనట్టే!

- అందుబాటులోకి రాని కమ్యూనిటీ హాల్స్. రోడ్లపైనే శుభకార్యాలు
- మధురానగర్, అయోధ్యనగర్లో మధ్యతరగతి ప్రజలకు అవస్థలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్, అయోధ్యనగర్లో కమ్యూనిటీ హాల్స్ ఉన్నా లేనట్లే ఉంది అక్కడి పరిస్థితి. కమ్యూనిటీ హాల్పనులు పూర్తయినా పాలకులు అందుబాటులోకి తేవడానికి తాత్సారం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు రోడ్లపైనే శుభకార్యాలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే మధురానగర్లో.. స్థానికుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్ పైఫ్లోర్ కూడా వేయాలని నిర్ణయించడంతో పలుదఫాలుగా సుమారు రూ.70 లక్షల వ్యయం అంచనాతో కమ్యూనిటీ హాల్ పనులు పూర్తిచేశారు. ఇక తమ కష్టాలు తీరాయని స్థానికులు భావించారు. అయితే కోవిడ్ సమయంలో వైద్య ఆరోగ్యశాఖకు వారి సామాన్లు స్టోర్ చేసుకునేందుకుగా కమ్యూనిటీ హాల్ను కేటాయించారు. స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ఇక్కడ కమ్యూనిటీ హాలును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలంటూ పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఇక్కడ కమ్యూనిటీ హాల్ పైఫ్లోర్లో ఆరోగ్యశాఖ సిబ్బంది స్టోర్రూమ్గానే వినియోగించుకుంటుండగా గ్రౌండ్ఫ్లోర్ నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి ఇక్కడ కమ్యూనిటీ హాల్ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

32వ డివిజన్లో..

పేద, మధ్యతరగతి ప్రజల కోసం 32వ డివిజన్ అయోధ్యనగర్లో రూ.17లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు శుభకార్యాలు చేసుకునేందుకుగానూ ఇక్కడ వినియోగంలోలేని జిమ్ను రూ.17 లక్షలతో ఆధునీకరించి సామాజిక భవనంగా తీర్చిదిద్దారు. నాటి ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. దీంతో ఇక్కడ కమ్యూనిటీ హాల్ను పట్టించుకున్న వారే కరువయ్యారు. ఈ ప్రాంతవాసులు శుభకార్యాలు చేసుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరదల సమయంలో మాత్రం పోలీసులకు ఈ కమ్యూనిటీ హాల్ను కేటాయించారు. అధికారులు స్పందించి వెంటనే సామాజిక భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



మధురానగర్ కమ్యూనిటీ హాలు



అయోధ్యనగర్లో కమ్యూనిటీ హాల్

అందుబాటులోకి తెస్తాం

అయోధ్యనగర్ కమ్యూనిటీ హాల్లో చిన్నపాటి పనులు మిగిలి ఉన్నాయి. అవి పూర్తిచేయాలని అధికారులను కోరుతున్నాం. పనులు పూర్తికాగానే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

–చన్నగిరి రామ్మోహన్రావు, 32వ డివిజన్ కార్పొరేటర్

వినియోగంలోకి తేవాలి



డివిజన్లో పేద, మధ్యతరగతి ప్రజలు చిన్నపాటి ఫంక్షన్లు చేసుకోవటానికి సైతం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి విజ్ఞప్తి మేరకు అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరు చేసి ప్రారంభోత్సవం చేశారు. పేదల కష్టాలు తీరుతాయని భావించాం. ప్రభుత్వం మారిన తర్వాత కమ్యూనిటీ హాల్ను పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి. -గుండే సుందర్పాల్, అయోధ్యనగర్


అధికారులు స్పందించాలి



గత ప్రభుత్వ హయంలో మధురానగర్లో చిరకాల సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇక్కడ నిర్మించిన కమ్యూనిటీ హాల్ ఇంకా వినియోగంలోకి రాలేదు. చిన్నపాటి ఫంక్షన్లు చేసుకోవాలన్నా రోడ్లపైనే నిర్వహించుకుంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే కమ్యూనిటీ హాల్ను వినియోగంలోకి తీసుకురావాలి.

-కంభం కొండలరావు, మధురానగర్

ఏడీసీపీలు ప్రసన్నకుమార్, రాజారావుకు సన్మానం



ఏడీసీపీలు ప్రసన్నకుమార్, రాజారావుతో న్యాయవాదులు

విజయవాడస్పోర్ట్స్: నగరంలోని సివిల్ కోర్టుల వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, బైక్ చోరీలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, క్రైం ఏడీసీపీ ఎం.రాజారావును గురువారం బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) ప్రతినిధులు బీబీఏ కార్యాలయంలో సన్మానించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను న్యాయవాదులు కోరారు. కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, కార్యదర్శి అరిగల శివరామప్రసాద్(రాజా), ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్కుమార్ పాల్గొన్నారు.